తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

కరీంనగర్ - నిజామాబాద్

రాజన్న సిరిసిల్ల | కామారెడ్డి

పెద్దపల్లి | జగిత్యాల

మంగళవారం

02 జూన్ 2026

పేజీలు : 8

Follow :









## అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి

### కలెక్టర్ గరిమ అగ్రవాల్

**రాజన్న సిరిసిల్ల బ్యూరో, జూన్ 01 (జనంసాక్షి);** ప్రజావాణిలో ప్రజలు సమర్పించిన అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. అధికారులు బాధ్యతగా వ్యవహరించి ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు.కాగా ప్రజావాణి మొత్తం 291 దరఖాస్తులు వచ్చాయి.జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం తో పాటు సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవో కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా రెవెన్యూ డివిజన్ల కార్యాలయాల లోనూ ప్రజావాణి కొనసాగుతుందని, స్థానిక ప్రజలు తమ అర్జీలు అందించాలని సూచించారు.ఇట్టి ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ,తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవం

- ○లబ్ధిదారుల ఇండ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్
- ○పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి
- ○పేదల సొంతింటి కలే ప్రభుత్వ లక్ష్యం

**బోయిన్ పల్లి జూన్ 01(జనంసాక్షి)**
రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని గుండన్నపల్లి, తడగొండ గ్రామాల్లో నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవ కార్యక్రమాలు సోమవారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమాలకు చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం, జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ ముఖ్య అతిథులుగా హాజరై, లబ్ధిదారుల నూతన గృహాలను రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు.గ్రామాల్లో పండుగ వాతావరణం, లబ్ధిదారుల ఆనందోత్సాహాల మధ్య ఈ వేడుకలు సాగాయి. గృహాలను ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే, కలెక్టర్ చేతుల మీదుగా ఇండ్ల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పర్యావరణ



పరిరక్షణపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన గృహాలను పరిశీలించి, ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాల అమలు తీరుపై లబ్ధిదారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి పేదవాడి సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లు కేటాయించడం పట్ల లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ.. తమ కుటుంబాలకు శాశ్వత నివాసం కల్పించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ వేడుకల్లో ఏఈ, డీఈలు, ఎంపీడీఓ, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, గ్రామస్థులు మరియు లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## వ్యయప్రయాసలకు గురై జిల్లా కేంద్రానికి రావద్దు

### ప్రజావాణి దరఖాస్తులను ఆయా డివిజన్ పరిధిలోనే సమర్పించి తమ సమస్యలను పరిష్కరించుకోవాలి: కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**కామారెడ్డి ప్రతినిధి, జూన్ 01 (జనంసాక్షి)**
వ్యయప్రయాసలకు గురై జిల్లా కేంద్రానికి రావద్దుస్థానిక స్థాయిలోనే సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలనిజిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరం లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ విక్టర్, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్ ఇన్‌చార్జ్)

మిగతా 3లో

## ప్రజా సమస్యల పరిష్కారానికే ‘గ్రీవెన్స్ డే’

### బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం:జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే

**రాజన్న సిరిసిల్ల బ్యూరో, జూన్ 01 (జనంసాక్షి);** ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు.సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 33 ఫిర్యాదులను ఆయన స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారు లకు ఫోన్ చేసి బాధితుల సమస్య లను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించా లని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకం గా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం



అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించు కుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

# పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలి

## మాజీ సర్పంచ్లను పోలీసులు ముందస్తు అరెస్టు




**గన్నేరువరం, జూన్ 01 (జనంసాక్షి):** సర్పంచులుగా గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని గన్నేరువరం సర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు తీగల మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం ముఖ్యమంత్రి కార్యాలయాన్ని ముట్టడించడానికి హైదరాబాద్ బయలుదేరిన బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంప వెంకన్న, తీగల మోహన్ రెడ్డిని పోలీసులు ముందస్తు అరెస్టు చేసి, గన్నేరువరం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా గంప వెంకన్న మాట్లాడుతూ.. పెండింగ్ విడుదల చేయాలని కోరితే ప్రభుత్వం మాజీ సర్పంచులను అక్రమ అరెస్టు చేయడం అన్యాయం అని అన్నారు. సర్పంచులుగా అప్పులు చేసి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసినట్లు, సంఘ భవనాలు కట్టించినట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర నిధులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో మాజీ సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నారని గుర్తు చేశారు. మరి కొంతమంది మాజీ సర్పంచులు అప్పుల పాలై, తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# గంభీరావుపేట మండల నూతన ఎస్సైగా సిహెచ్ శ్రీకాంత్



గంభీరావుపేట జూన్ 01(జనం సాక్షి): రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన సిహెచ్. శ్రీకాంత్ సోమవారం రోజు భాధ్యతలు స్వీకరించారు. ఈయన సిరిసిల్లలో పనిచేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా గంభీరావుపేట ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీకాంత్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పని చేస్తామని, ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేస్తూనే చట్టాన్ని ఉల్లంఘించే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తానని, నిషేధిత గుట్కా, గంజాయి విక్రయాల అరికడతామని, దానితో పాటు మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన, ఈ వ్ టీజింగ్, పాల్పడే వారి పట్ల కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా ఆపద సమయంలో డయల్ 100 నెంబర్ కు ఫోన్ చేసి పోలీసుల సహాయాన్ని పొందాలని ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే పోలీసులకు సమాచారం అందజేయాలని ఎస్ఐ తెలిపారు.

# గురుకుల కార్మికుల తొలగింపును ఆపాలి

- కలెక్టర్ కార్యాలయం ఎదుట బీఎంఎస్ ధర్నా.
- ప్రజావాణిలో వినతిపత్రం.




**గోదావరిఖని, జనంసాక్షి :** మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల విద్యాసంస్థల్లో పనిచేస్తున్న నాన్-టీచింగ్ సిబ్బందిని తొలగించే ప్రయత్నాలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బీఎంఎస్ పెద్దపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా బీఎంఎస్ నాయకుడు తొర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ, 2017 నుంచి గురుకులాల్లో స్వీపింగ్, హౌస్‌కీపింగ్, సెక్యూరిటీ, శానిటేషన్ తదితర విభాగాల్లో సేవలందిస్తున్న కార్మికులను ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా తొలగించి, వారి స్థానంలో కొత్త కాంట్రాక్టర్లకు టెండర్లు కేటాయించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టడం అన్యాయమన్నారు. గురుకుల విద్యాసంస్థల నిర్వహణలో నాన్-టీచింగ్ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని, అలాంటి కార్మికులను ఒక్కసారిగా విధుల నుంచి తప్పించడం వల్ల వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.బీఎంఎస్ జిల్లా కార్యదర్శి సాయవేణి సతీష్ మాట్లాడుతూ, ఒకవైపు నిరుద్యోగ నిర్మూలన, యువతకు ఉపాధి కల్పనపై ప్రభుత్వం ప్రకటనలు చేస్తూనే, మరోవైపు ఇప్పటికే పనిచేస్తున్న కార్మికుల ఉద్యోగాలను తొలగించడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు కనీస వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి కార్మిక హక్కులను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. గురుకుల కార్మికుల తొలగింపుల నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ అనంతరం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో బీఎంఎస్ జిల్లా నాయకులు బండారి శ్యామసుందర్, గురుకులాల కార్మికులు స్వరూప, శారద, అంజన్న, తిరుపతి, సుజాత, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

### ఇందిరమ్మ గృహాలను ప్రారంభించిన

# సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీ రావు



**రామగిరి జనం సాక్షి :01** రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలో సోమవారం 10 ఇందిరమ్మ గృహాలను సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీ రావు ప్రారంభించారు. ప్రభుత్వం నిర్మించిన ఈ గృహాలను అన్ని గ్రామాలలో ప్రారంభించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించిన విషయం విధితమే. ఈ క్రమంలో గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ప్రభుత్వం నిర్ణయించిందని, దీనిలో భాగంగా ప్రస్తుతం 97 గృహాలు వివిధ దశలో నిర్మాణం పూర్తయ్యాయని సర్పంచ్ పల్లె ప్రతిమ.పీవీ రావు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా 10 గృహాలలోకి ఆమె స్వయంగా వెళ్లి రిబ్బన్ కట్ చేసి కొబ్బరికాయ కొట్టి గృహాల ను ప్రారంభించారు. ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ గంగుల సంతోష్, హౌసింగ్ ఏఈ ఎన్ రేఖ, వార్డు సభ్యులు కెక్కర్ల. ఉషా అశోక్, జక్కుల పద్మా చందన్, కలవేన రవి, ఇందిరమ్మ కమిటీ మెంబర్లు భద్రపు శకుంతల, లలిత తదితరులు పాల్గొన్నారు.

# జీ,వో నెంబర్ 17 ను రద్దు చేయాలి

### మైనార్టీ జేఏసీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జి కొంకటి శేఖర్




**సిరిసిల్ల టౌన్ జూన్ 1 ( జనం సాక్షి)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రకటించిన జీవో నెంబర్ 17 ను వెంటనే రద్దు చేయాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ జేఏసీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్చార్జి కొంకటి శేఖర్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రుల ద్వారా విద్యార్థులకు నాణ్యమైన సరుకులను విద్యను అందే విధంగా తయారు చేస్తే నేడు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కాంట్రాక్టు అంటేనే కొన్ని వర్గాల చేతిలో గుత్తాధిపత్యం అనే విధంగా వ్యవహరిస్తూ జీవో నెంబర్ 17 తెచ్చి బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ వర్గాల్లో ఎదుగుతున్న వ్యక్తులను చూసి ఓర్వలేక పోతుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే పురుగుల అన్నం, నీళ్ల చారు అనే నానుడినీ కొనసాగించే విధంగా రేవంత్ రెడ్డి ప్రవర్తిస్తుంటే అందుకు వంత పాడే విధంగా రాష్ట్ర మంత్రి లక్ష్మణ్ కుమార్ భజన చేస్తున్నారని ఎద్దేవా చేశారు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతాయుతంగా రాజ్యాంగబద్ధంగా అన్ని వర్గాలకు ఉపయోగపడేందుకు వ్యవహరించాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక దాదాపు 130మంది గురుకుల విద్యార్థులు చనిపోయారని, అనేక మంది ఫుడ్ పైజన్ గురి అవుతున్నా ఒక్క రోజు కూడా ముఖ్యమంత్రి అయినా తాను రాష్ట్ర మంత్రిగా స్పశీథించిన దాఖలు లేవన్నారు. ఇప్పటికైనా కళ్ళు తెరిచి ఈ వర్గాల ప్రయోజనం కోసం ఆలోచించమని లేని పక్షంలో ప్రభుత్వం మెడలవంచైనా జీవో నెంబర్ 17 రద్దు చేసే వరకు క్షేత్రస్థాయిలో ఉద్యమాల్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్, గోపాల్రావుపల్లి సర్పంచ్ గుండు ప్రేమ్ కుమార్, ఉప సర్పంచ్ పొన్నాల నర్సింలు, చిన్న లింగాపూర్ మాజీ ఎంపీటీసీ శాగ దేవేందర్, నాయకులు లింగంపల్లి మధూకర్, తదితరులు పాల్గొన్నారు

# బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన కృష్ణవేణి




**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జూన్ 1 (జనంసాక్షి)** వేములవాడ కృష్ణవేణి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ మరోసారి తమ విద్యా ప్రతిభను చాటుకుంది. 2025--26 విద్యా సంవత్సరంలోని ఎస్ఎస్సీ ఫలితాల్లో 586 మార్కులు సాధించిన పాఠశాల విద్యార్థిని గజ్జల మృదుల బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించి అందరి ప్రశంసలు అందుకుంది.ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు ప్రతాప రామకృష్ణ పాఠశాలల డైరెక్టర్ సన్నిధి వెంకట కృష్ణలు సోమవారం విద్యార్థినిని శాలువాతో సన్మానించి అభినందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మృదుల సాధించిన ఈ విజయం పాఠశాలకు గర్వకారణమన్నారు. ఆమె కృషి పట్టుదలకు తగిన ఫలితం లభించిందన్నారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసి ఉన్నత లక్ష్యాల వైపు నడిపించడంలో కృష్ణవేణి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు.విద్యార్థిని తల్లిదండ్రులను ప్రత్యేకంగా అభినందిస్తూ,వారి సహకారం మరియు ప్రోత్సాహమే ఈ విజయానికి బలమన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్,ఉపాధ్యాయులు, పాల్గొనారు.



## చెత్త చెదారంతో నిండి కంపు కొడుతున్న గటేరు పట్టించుకోని అధికారులు

**రుద్రంగి జూన్ 1 (జనంసాక్షి)**
రుద్రంగి మండల కేంద్రంలో వేములవాడ కోరుట్ల ప్రధాన రహదారికి ఆనుకొని నిర్మించిన డ్రైనేజీ చెత్త చెదారంతో నిండి మురుగు నీరు డ్రైనేజీలో అధికంగా చేరడంతో దుర్గంధం వెదజల్లుతుంది. బస్టాండుకు సమీపంలో డ్రైనేజీ ఉండడంతో ప్రయాణికులకు ప్రజలకు ఇబ్బందిగా మారుతుంది. ఘటేరుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరగడం వల్ల విపరీతమైన దోమలు తయారయ్యాయి. ఎప్పటికప్పుడు పారిశుధ్యం చేస్తే ఎలాంటి రోగాలు రావు కానీ అధికారులు పట్టించుకోకపోవడంతో నెలల తరబడి చెత్తాచెదారం మురుగునీరు పేరుకుపోవడంతో దుర్గంధం వెదజల్లుతుంది. ఇకనైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి పిచ్చి మొక్కలను తొలగించి గటేరులో మురుగునీరు ఆగకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా దోమల నివారణ కొరకు బ్లీచింగ్ పౌడర్ దోమల నివారణ పొగ కొట్టినట్లయితే దోమలను నివారించవచ్చని పలువురి అభిప్రాయం.

## రిక్వెస్ట్ బస్టాప్ వద్ద బస్సు ఆపాలని వినతి పత్రం

**కథలాపూర్, జూన్ 1(జనంసాక్షి )**
కథలాపూర్ మండలంలోని ఎల్లమ్మ టెంపుల్ పోసానిపేట వద్ద రిక్వెస్ట్ బస్సు స్టాప్ బస్సు లు ఆపాలని గురించి వినతి పత్రం డిపో మేనేజర్ కి పోసానిపేట సర్పంచి ఆకుల సుజాత రాజేందర్ మరియు పాలక వర్గం ఇవ్వడం జరిగింది.





25, కేవి డీటీఆర్ ప్రారంభించిన సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి

**ముస్తాబాద్ జోన్ 01 (జనంసాక్షి)**
ముస్తాబాద్ మండలం నామాపూర్ గ్రామంలో గ్రామ ప్రజలు కరెంటు సమస్యతో బాధపడుతూ ఉన్నారు దాని దృష్టిలో పెట్టుకొని హై వోల్టేజ్ కారణంగా విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడుతుంది. ఈ నేపథ్యంలో సమస్య కొంచెం పరిష్కరించడానికి ఏర్పాటు చేసిన నూతన 25 కేళి డీటీఆర్ ను ఏర్పాటుచేసిన సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాదాస్ అనిల్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఏళ్ల బాల్ రెడ్డి, వాడు సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు

## కాలనీలలో వెలసిన అక్రమ బెల్ట్ షాపులను తొలగించాలి

**బోధన్, జూన్ 1 ( జనంసాక్షి ) :**
కాలనీలలో వెలసిన అక్రమ బెల్ట్ షాపులను తొలగించాలని కోరుతూ సోమవారం వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్య వంశీ బోధన్ సీఐ కు వినతిపత్రం అందించారు. బోధన్ లోని బెల్లాల్ గ్రామంలో విచ్చలవిడిగా మద్యం అమ్ముతున్నారని, బెల్టు షాపులు అడుగడుగునా పెట్టి మద్యాన్ని విక్రయిస్తున్నారన్నారు. ఈ విధంగా మద్యాన్ని అమ్మడం వలన యువత మద్యానికి బానిసలై పోతున్నారన్నారు. మహిళలు వీధిలో తిరగకుండా బయటకు రావాలంటే భయపడుతున్నారు ఈ విధంగా ప్రభుత్వం ఎక్సైజ్ అధికారులు ఎక్కడపడితే అక్కడ మద్యం విక్రయించడానికి అనుమతులు ఇవ్వడం సిగ్గుచేటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.



## వ్యయప్రయాసలకు గురై జిల్లా కేంద్రానికి రావద్దు

ఎన్.వి. గిరి, జిల్లా పరిషత్ సీఈఓ చందర్‌లతో కలిసి వివిధ మండలాల నుండి వచ్చిన ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో మొత్తం 105 దరఖాస్తులు అందాయని తెలిపారు. ఆయా శాఖలకు సంబంధించిన అర్జీలను సంబంధిత అధికారులకు అందజేస్తూ, వాటిని ప్రాధాన్యతతో పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు బాన్సువాడ, ఎల్లారెడ్డి డివిజన్‌లలో కూడా ప్రజావాణి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆయా డివిజన్‌ల పరిధిలోని ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను సంబంధిత డివిజన్ కార్యాలయాల్లోనే సమర్పించి పరిష్కారం పొందాలని సూచించారు. చిన్న చిన్న సమస్యల పరిష్కారం కోసం అనవసరంగా వ్యయప్రయాసలకు గురై జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం లేదని, స్థానిక స్థాయిలోనే సమస్యలను పరిష్కరించుకునే అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. అధికారులు ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ప్రజావాణిలో ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ళను ప్రారంభించిన సర్పంచ్

### కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వం: శామప్ప



**పెద్ద కొడప్గల్ జూన్ 01 (జనంసాక్షి):**
కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని కాంగ్రెస్ పార్టీ పెద్ద కొడప్గల్ మండల అధ్యక్షులు శామప్ప తెలిపారు. సోమవారం మండలంలోని పోచారం తాండ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ళను సర్పంచ్ సీతాబాయి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు శామప్ప ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి నిరుపేదకు పక్క ఇల్లు ఉండాలని ఉద్దేశంతో ఇందిరమ్మ ఇళ్లు పథకం ద్వారా లబ్ధి చేకూరుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల

### సర్పంచ్ రెడ్డి కిరణ్ కుమార్

**పిట్లం జూన్ 1 (జనంసాక్షి):**
పిట్లం మండల పరిధిలోని చిన్న కొడప్గల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆరు ఇందిరమ్మ ఇళ్లను సోమవారం గ్రామ సర్పంచ్ రెడ్డి కిరణ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... నిరుపేదలందరికీ పక్క ఇల్లు నిర్మించి ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, ప్రతి గ్రామంలో నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తుందని, కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్ జారా నాగిరెడ్డి, ఉప సర్పంచ్ సాయినాథ్, ప్రజా ప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



# జూలై,ఆగస్టులో మధ్యంతర కరువు ముప్పు

### ఎల్‌నినోపై క్రిడా శాస్త్రవేత్త కేవీ రావు హెచ్చరిక

**ముస్తాబాద్ జూన్ 01 (జనంసాక్షి)**
'జూన్‌లో కురిసే తొలకరి వర్షాలను చూసి రైతులు తొందరపడి వరి సాగుకు వెళ్లొద్దు. నీటి లభ్యతపై స్పష్టత వచ్చిన తర్వాతే సాగు చేయాల్సిన పంటలను ఎంపిక చేసుకోవాలి' అని క్రిడా (సీఆర్ఐడీఏ) ప్రధాన శాస్త్రవేత్త కేవీ రావు సూచించారు. జూలై, ఆగస్టు నెలల్లో మధ్యంతర కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశాలు ఉన్నందున అధిక నీరు అవసరమయ్యే దీర్ఘకాలిక వరి రకాల సాగుపై అప్రమత్తంగా ఉండాలన్నారు. గుంటూరులోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో శనివారం నిర్వహించిన '2026లో ఎల్‌నినో సంభవిస్తుందన్న వాతావరణ సూచన నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక వర్క్‌షా?ప'లో ఆయన ముఖ్యోపన్యాసం చేశారు. భారత వాతావరణ శాఖ తాజా అంచనాల ప్రకారం రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండకపోవచ్చని, అయితే సాధారణ వర్షాలు కురుస్తాయని భావించి రైతులు నీరు ఎక్కువగా అవసరమయ్యే వరి వంటి పంటలను ఎక్కువగా సాగు చేయడం ప్రమాదకరమని చెప్పారు. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కూడా సాగునీరు అందుబాటులో ఉంటుందన్న పూర్తి భరోసా ఉన్నప్పుడే వరి సాగుకు వెళ్లాలని, లేకపోతే ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని చెప్పారు. ఉపకులపతి పీవీ సత్యనారాయణ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావానికి ఎక్కువగా గురయ్యే ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో కూడా ఇలాంటి అవగాహన సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు. ఈ వర్క్‌షా?పలో వచ్చిన సూచనలు, శాస్త్రవేత్తల సిఫార్సులను జిల్లాల వారీగా క్రోడీకరించి వ్యవసాయ శాఖ, డీఏఏటీటీ కేంద్రాలు, కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా రైతులకు అందజేస్తామని చెప్పారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా రైతులు ముందస్తు ప్రణాళికతో సాగు చేస్తే నష్టాలను గణనీయంగా తగ్గించుకోవచ్చన్నారు. వర్క్‌షా పలో రాష్ట్రంలోని ఐదు వ్యవసాయ-వాతావరణ మండలాలకు సంబంధించిన ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలను శాస్త్రవేత్తలు వివరించారు. కరువును తట్టుకునే పంట రకాలు, ఆలస్య వర్షాలకు అనువైన పంటలు, నీటి పొదుపు సాగు విధానాలపై సూచనలు చేశారు.



## బండారి రాజిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన టిపిసిసి ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి



కామారెడ్డి ప్రతినిధి, జూన్ 01 (జనంసాక్షి) కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో లింగాపూర్ గ్రామానికి చెందిన బండారి రాజారెడ్డి కుటుంబాన్ని టిపిసిసి ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి పరామర్శించారు. లింగాపూర్ శివారులో జరిగిన బండారి రాజారెడ్డి హత్యకు గురైన బండారి రాజారెడ్డి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా టిపిసిసి ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, ఈ హత్య చాలా బాధాకరమని, వారి కుటుంబానికి ఇది తీరని లోటని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలియజేస్తూ, ఈ కష్టకాలంలో పార్టీ తరఫున పూర్తి మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు గడ్డమీది మహేష్, మాజీ కౌన్సిలర్లు, సలీం, చాట్ల వంశీ, పిడుగు సాయిబాబు,డీసీసీ ఉపాధ్యక్షులు నిమ్మ విజయ్ కుమార్ రెడ్డి,క్రీడా అధ్యక్షులు నర్సా గౌడ్, సేవాదళ్ అధ్యక్షులు నర్సల్లా మహేష్, శశి, ఉన్నారు.

## రైతు కుటుంబానికి రెండు లక్షల చెక్కు అందజేత




జనం సాక్షి జూన్ 2 గాంధారి: గాంధారి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లో బ్రాహ్మణపల్లి కి చెందిన రైతు బొమ్మటి శేఖర్ క్రాప్ లోన్ తీసుకోవడం జరిగింది. అయితే ఇటీవల బైక్ యాక్సిడెంట్ లో ప్రమాదవశాత్తు చనిపోవడం జరిగింది. సొసైటీ జనతా ప్రీమియం ఇన్సూరెన్స్ కలిగి ఉండడం వల్ల అతని కుటుంబానికి రెండు లక్షల ఇన్సూరెన్స్ కాలేదు రావడంతో ఆయన భార్యకు సొసైటీ ఆధ్వర్యంలో రెండు లక్షలు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు సాయికుమార్ డిసిసిబి బ్రాంచ్ మేనేజర్ శ్రీపాల్ సొసైటీ సీఈవో సాయిలు సొసైటీ డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు జరిగింది.

## అర్హులైన ప్రతి ఒక్కరికి ఫించన్ ఇవ్వాలి

### బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పోతిపెద్ది కిషన్ రెడ్డి




ముత్తారం మే 31(జనంసాక్షి) మండలంలో ఉన్న అర్హులైన ప్రతి ఒక్కరికి చేయూత పథకం లో పింఛన్ లు అందించాలని ముత్తారం బీ ఆర్ ఎస్ మండల శాఖ అధ్యక్షుడు పోతుపెద్ది కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఓడేడు గ్రామంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం చేయూత పథకం లో రెండు లక్షల మందికి పింఛన్లు ఇస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు 2 లక్షలే కాకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్ మంజూరి చేయాలన్నారు.కాంగ్రెస్ పార్టీ నేతలు ఎన్నికల హామీలో చేయూత పథకం లో వికలాంగులు కు 6 వేలు వృద్ధాప్య వితంతు ఒంటరి మహిళా గీత కార్మికులకు చేనేత లాంటి వారికి 4 వేలు ఇస్తామని హామీ ఇచ్చారాణి వాటిని బేషరతుగా అమలు చేయాలని డిమాండ్ చేశారు ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి ఎన్నికలలో ఇచ్చిన హామీ లో చేయూత పథకం లో అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధిచేకూర్చాలని ఆయన కోరారు.

## సింగరేణిలో డిపెండెంట్‌లకు నియామక పత్రాలు ఇవ్వాలి

- 3 న అర్జీవన్ జి.ఎం కార్యాలయం ముందు ధర్నా
- ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను పిలుపు..

గోదావరిఖని, జనంసాక్షి : సింగరేణిలో డిపెండెంట్లకు ఉద్యోగాల ఉత్తర్వులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జూన్ 3న ఉదయం 10 గంటలకు అర్జీవన్ జనరల్ మేనేజర్ కార్యాలయం వద్ద ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్, ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి లిరంగు శ్రీనులి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సింగరేణిలో కారుణ్య ప్రాతిపదికన అనర్హులుగా ప్రకటించబడిన ఉద్యోగుల యొక్క 400 మందికి పైగా ఆధారపడిన పిల్లలు ఇప్పటికీ ఉపాధి కోసం ఎదురుచూస్తున్నారని, వారికి ఇంతవరకు నియామక ఉత్తర్వులు ఇవ్వలేదని పేర్కొన్నారు. నిరుద్యోగం కారణంగా వారి కుటుంబాలు గత రెండేళ్లుగా తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, డిపెండెంట్లు త్వరిత నియామకం కోసం పదేపదే కార్యాలయాల చుట్టూ తిరుగుతూ అవస్థలు పడుతున్నారని ఆయన అన్నారు. డిపెండెంట్ల సమస్యను దృష్టిలో పెట్టుకొని గుర్తింపు సంఘం ఏఐటియుసి సింగరేణి వ్యాప్తంగా ఉన్న అన్ని జనరల్ మేనేజర్ కార్యాలయాల ముందు ధర్నా నిర్వహించి యాజమాన్యానికి మెమోరాండం అందజేయాలని నిర్ణయించిందని ఆయన తెలిపారు.కనుక డిపెండెంట్లు అందరూ జూన్ 3న ఉదయం 10 గంటలకు అర్జీవన్ జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాలో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని రంగు శ్రీను కోరారు.

## తెలంగాణ అమరవీరుల త్యాగాలను స్మరిద్దాం

### బీసీ సెల్ అధ్యక్షులు దొండి రమణ



ఆర్మూర్,జూన్ 1 (జనంసాక్షి): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, ప్రజలందరికీ బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు దొండి రమణ ఆవిర్భావ శు భాకాంక్షలు తెలిపారు.ఎన్నో ఉద్యమాలు,పోరాటాలు,త్యాగాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం నేడు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు.తెలంగాణ ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిన అమరవీరులకు ఈ సందర్భంగా ఘన నివాళులు చెప్పారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన అందిస్తూ రైతులు,మహిళలు,యువత,పేదల సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకుని అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,రైతు రుణమాఫీ,ఆరోగ్య సేవల విస్తరణ,ఇందిరమ్మ ఇళ్ల పథకం,మహిళా సంఘాల ఆర్థిక సాధికారత కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు.మహిళాసంఘాలకుభూములు,రుణాలు,వ్యాపార అవకాశాలు కల్పించే కార్యక్రమాలు చేపడుతూ ముందుకు సాగుతున్నారన్నారు.తెలంగాణను భవిష్యత్తులో ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో మౌలిక సదుపాయాలు,మెట్రో విస్తరణ, పరిశ్రమలు,ఉపాధి అవకాశాలు, గ్రామీణాభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు.అమరవీరుల ఆశయాల సాధనే మన లక్ష్యం..ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం…అభివృద్ధి,సంక్షేమం,సామాజిక న్యాయంతో తెలంగాణను మరింత ముందుకు తీసుకెళ్దామన్నారు.తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రెండవ దఫా ఇందిరమ్మ ఇల్లు ప్రారంభిస్తున్న శుభదినంగా ప్రజలందరికీ మరోసారి తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

## స్మశాన వాటిక అభివృద్ధికి మున్సిపాలిటీ పూర్తి సహకారం

### చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్



కామారెడ్డి ప్రతినిధి, జూన్ 01 (జనంసాక్షి) 8వ వార్డు మున్సిపల్ స్మశాన వాటిక అభివృద్ధిని మున్సిపాలిటీ అడ్డుకుంటోందనే ప్రచారం పూర్తిగా అవాస్తవమని మున్సిపల్ చైర్ పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా ఆమె సోమవారం మీడియాతో మాట్లాడారు. జూన్ 5న మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఈ అంశానికే తొలి ప్రాధాన్యత ఇస్తామన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి నిబంధనల ప్రకారం అనుమతులు రాగానే తదుపరి చర్యలు వేగవంతం చేస్తామన్నారు. డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ తయారీలో ఉందని తెలిపారు. అన్ని అనుమతులు పూర్తి కాగానే నిర్మాణానికి ముందుకు వచ్చిన స్వచ్ఛంద సంస్థకు పూర్తి నిర్మాణ బాధ్యతలు అప్పగిస్తామన్నారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు, పరిశుభ్రమైన వాతావరణం, అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే మున్సిపాలిటీ ధ్యేయమన్నారు. ప్రజల సంక్షేమానికి సంబంధించిన ప్రతి అంశంలో పారదర్శకంగా వ్యవహరిస్తూ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని త్వరలోనే ఈ స్మశాన వాటికను అన్ని హంగులతో ఆదర్శవంతమైన సదుపాయంగా తీర్చిదిద్దుతామని తెలిపారు.

## వీవోఏలకు ఎడపల్లి సర్పంచ్ కందగట్ల రాంచందర్ మద్దతు



ఎడపల్లి, జూన్ 1 ( జనంసాక్షి ) : తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని ఎడపల్లి మండల కేంద్రంలో విఓఏలు చేస్తున్న నిరసన దీక్షకు భారతీయ జనతా పార్టీ తమ పూర్తి మద్దతు ప్రకటించింది, ఈ మేరకు బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు, ఎడపల్లి సర్పంచ్ కందగట్ల రాంచందర్ దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలియజేశారు, ఈ సందర్భంగా కందగట్ల రాంచందర్ మాట్లాడుతూ, విఓఏలకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత,ప్రమోషన్ కల్పించాలని, కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేసి వారికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, ఈ సమ్మె ఇలాగే కొనసాగితే డ్వాక్రా సంఘాలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని ప్రభుత్వం తక్షణమే స్పందించి వారికి న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు మల్లెపూల శ్రీనివాస్, మండల పార్టీ ఉపాధ్యక్షులు భట్టు రాజు, నాయకులు పాట గంగాధర్, నాయిని లక్ష్మణ్ గౌడ్, శివ చైతన్య, నిశాంత్ యాదవ్,వార్డు సభ్యులు దండి శంకర్, అనిరుద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ 19వ డివిజన్ రేకుర్తిలో రూ.10 లక్షలతో

## సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేసిన మేయర్



**కరీంనగర్ అర్బన్, జూన్ 01 (జనంసాక్షి) :** కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 19వ డివిజన్, రేకుర్తి, హనుమాన్ నగర్ లో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు సోమవారం రోజు మేయర్ కొలగాని శ్రీనివాస్ భూమి పూజ నిర్వహించారు. మున్సిపల్ సాధారణ నిధుల నుండి రూ. 10 లక్షల వ్యయంతో ఈ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టనున్నారు. ఈ అభివృద్ధి కార్యక్రమానికి కరీంనగర్ నగరపాలక సంస్థ మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు ముఖ్య అతిథులుగా హాజరై, భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో 19వ డివిజన్ కార్పొరేటర్ సుధాగోని మాధవి - కృష్ణ గౌడ్, మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులు, హనుమాన్ నగర్ రోడ్ నెంబర్ 11 కాలనీ వాసులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## రోడ్డు వెడల్పును 30 ఫీట్లకు తగ్గించాలని పంచాయతీ కార్యదర్శికి వినతి

**ఎల్లారెడ్డిపేట, జూన్ 01, (జనంసాక్షి) :**

ఎల్లారెడ్డిపేట మండలంలోని బొప్పాపూర్ గ్రామంలో రోడ్డు వెడల్పును 30 ఫీట్లకు తీర్మానించాలని ఇండ్లు కోల్పోతున్న సుమారు 40 కుటుంబాల బాధితులు సోమవారం పంచాయతీ కార్యదర్శి, గ్రామ సర్పంచ్ ఇల్లెందుల గీతాంజలి శ్రీనివాస్ రెడ్డి, ఉపసర్పంచ్ కొండాపురం వెంకటరెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. రోడ్డు 60 ఫీట్ల వెడల్పులో నిర్మిస్తే నిరుపేద ప్రజలు పూర్తిగా ఇల్లు కోల్పోయే పరిస్థితి ఉందని, కొంతమందికి ఇల్లు కట్టుకుందామన్న స్థలం లేదని ఆవేదన వ్యక్తం చేసారు. ఇటీవలే దిమ్మడి పోచమ్మ అనే మహిళకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా అట్టి నిర్మాణం 15 ఫీట్లలో నిర్మాణం జరిగింది. ఒకవేళ 60 ఫీట్లకు తీర్మానం చేస్తే నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇల్లు తొలగించే పరిస్థితి ఉందన్నారు. బాధితులను పరిగణలోకి తీసుకొని రోడ్డు వెడల్పును 30 ఫీట్లకు చేయవలసిందిగా బాధితులకు ఇందిరమ్మ ఇళ్లతో పాటు, స్థలం లేని వారికి స్థలం కూడా కేటాయించాలని గ్రామానికి బైపాస్ రోడ్డు స్మశానవాటిక వరకు ఉందని అట్టి బైపాస్ రోడ్డును గంగమ్మ గుడి వరకు నిర్మించాలని బాధితులు వినతి పత్రాన్ని సమర్పించారు.



### బోధన్ ఉమ్మడి మండలంలో

## సామూహిక గృహ ప్రవేశాలు

**బోధన్, జూన్ 1 ( జనంసాక్షి ) :**

బోధన్, సాలూర ఉమ్మడి మండలంలో సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో సామూహిక గృహ ప్రవేశాలను అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు మండలంలోని ఆమ్దాపూర్ గ్రామంలో సర్పంచ్ పోరెడ్డి గంగాధర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎంపీవో యెల్ల వేణు, పంచాయతీ కార్యదర్శి రంజిత్ సింగ్ లు గ్రామానికి చెందిన కుర్నాపల్లి శంకర్, డాక్టర్ గొల్ల సాయిలు ల ఇంటి గృహ ప్రవేశాలను ఎంతో లాంఛనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పోరెడ్డి గంగాధర్, ఉపసర్పంచ్ పోతనకర్ రుమ్మాజి, పాలక వర్గం, మాజీ డిసిసి కార్యదర్శి పల్లెన్న, జయ రాజు, సమీర్, నర్రా సుధాకర్, నీరడి పెద్ద గంగారాం తదితరులు పాల్గొన్నారు.



## అక్రమ పట్టా రద్దు చేయాలి- ప్రజావాణిలో దరఖాస్తు

**- ప్రభుత్వ భూమిని,గ్రామ అవసరాల కోసం వినియోగించాలి.!!**

**- జిల్లా కలెక్టర్కు వినతి పత్రం**

**సుల్తానాబాద్,జూన్ 01(జనంసాక్షి) :** మండలం లోని కనుకుల గ్రామంలో గల సర్వే నెంబర్ 221 ప్రభుత్వ భూమి 100 ఎకరాలు ఉండగా, అందులో నుండి 11 ఎకరాల 31 గుంటల ప్రభుత్వ భూమిని, ప్రముఖ కాంట్రాక్టర్, భూస్వామి, జిన్నా శ్రీనివాసరెడ్డి అనే వ్యక్తి తన భార్య శ్రీలత పేరు మీద ప్రభుత్వ భూమిని అక్రమపట్టా చేయించుకున్నారని, వెంటనే రద్దు చేయాలని కనుకుల గ్రామ సర్పంచ్ కర్రె కవిత కుమారస్వామి ప్రజావాణిలో సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ భూమి మూడు గ్రామాలకు సంబంధించిన ప్రజల అవసరాల కొరకు ఉపయోగపడే,విధంగా చర్యలు తీసుకోవాలని, డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిన్నా శ్రీనివాస్ రెడ్డి అనే వ్యక్తి తన డబ్బు పలుకుబడిని ఉపయోగించి ప్రభుత్వ భూమిని అక్రమ పట్టా చేయించుకోవడం ప్రభుత్వాన్ని మోసం చేయడమేనని ఆరోపించారు. పేదవాడికి ప్రభుత్వ భూమి ఒక్క గుంట పట్టా చేయమంటే, ఎన్నో ఇబ్బందులు పెట్టుతున్న అధికారులకు, భూ స్వాములకు, కాంట్రాక్టర్లకు, బడా వ్యాపారులకు, నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ భూమిని ఏ విధంగా పట్టా చేస్తారని వారు ప్రశ్నించారు.ఇట్టి అక్రమ పట్టా, చేయడానికి సహకరించిన అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేని ఎడల, పెద్ద ఎత్తున ధర్నా, ఆందోళన కార్యక్రమాలను చేపట్టుతామని హెచ్చరించారు. అక్రమ పట్ట భూమిపై పూర్తిస్థాయిలో విచారణ చేసి, మూడు గ్రామాల ప్రజలకు ఉపయోగపడే విధంగా చర్య లు చేపట్టాలని కలెక్టర్ ను కోరారు. లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని అనుకూల సర్పంచ్ కర్రే కవిత కుమార్ హెచ్చరించారు. కేవలం నాలా కన్వర్షన్ను రద్దుచేసి పట్టా రద్దు చేయలేదని వెంటనే అక్రమంగా చేసిన పట్టా రద్దు చేయాలన్నారు. రద్దు చేసేంతవరకు, జిన్న శ్రీనివాస్ రెడ్డి శ్రీలతలపై చర్యలు తీసుకునేంతవరకు మా యొక్క పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

## టీబి ముక్త్ భారత్ అభియాన్‌లో బాగంగా వైద్య శిబిరం



**ఎల్లారెడ్డిపేట, జూన్ 01, (జనంసాక్షి) :** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో టిబి ముక్త్ భారత్ అభియాన్ 100 రోజుల ప్రోగ్రాంలో బాగాంగ హైరిస్క్ గ్రామాలలో ఎక్సరే కార్యక్రమం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ గరిమా అగర్వాల్, జిల్లా వైద్యాధికారిని డాక్టర్ రజిత ఆదేశానుసారంగా మండల వైద్యాధికారి డాక్టర్ సారియా అంజుం ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. 102 మంది హైరిస్క్ ఉన్న వారికి ఎక్సరే తీయడం జరిగిందని డాక్టర్ సారియా అంజుం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట సర్పంచ్ ఎలగందుల నర్సింహులు, టీబి సూపర్వైజర్స్ మహిపాల్, గంగాధర్, ఎక్సరే టెక్నిషియన్ బాలు, టీబి నోడల్ హెచ్ఎస్ పద్మ, ఎమ్ఎల్‌హెచ్‌పి ప్రసన్న, ఏఎన్ఎమ్ఎస్ భూలక్ష్మి, అమృతవల్లి, శారద, లత, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులను సన్మానించిన నాయకులు

**బోధన్, జూన్ 1 ( జనంసాక్షి ) :**

బోధన్ పట్టణంలో మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ పరిశుద్య కార్మికులను మున్సిపల్, ఫ్లోర్ లీడర్ శరత్ రెడ్డి, కౌన్సిలర్లు, డబ్బు , ఆదినారాయణ, ఇమ్రాన్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు దాము, మాజీ పట్టణ అధ్యక్షుడు పాషా లు సన్మానించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బోధన్ మున్సిపల్ కార్మికులు బక్రీద్ సందర్భంగా చేసిన పరిశుద్ధ పనులు అభినందనీయం అన్నారు. మున్సిపల్ సిబ్బంది బక్రీద్ రోజున ఉదయం నుండి కుర్బనిలు చేసిన చోట వ్యర్థాలను వేణు వెంటనే తొలగించడం పని నైపుణ్యానికి నిదర్శనం అన్నారు. పారిశుద్య కార్మికులను సమన్వయం చేసుకుంటే పట్టణ ప్రజలకు ఇబ్బంది కలగ కుండా చేసిన మున్సిపల్ చైర్మన్ తూము పద్మ శరత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



## సస్టైనబుల్ క్యాంపస్ ఇంపాక్ట్ సమ్మిట్-2026లో ఎస్ఆర్ఆర్ కళాశాలకు గోల్డ్ అవార్డు



**కరీంనగర్ టౌన్, జూన్ 1 ( జనంసాక్షి):** పర్యావరణ పరిరక్షణ, హరితాభివృద్ధి కార్యక్రమాల అమలులో విశిష్ట ప్రతిభ కనబర్చిన శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (అటానమస్), కరీంనగర్‌కు జాతీయ స్థాయిలో గౌరవప్రదమైన గుర్తింపు లభించింది. హైదరాబాద్ గచ్చిబౌలిలో నిర్వహించిన భారత్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రామ్ ? సస్టైనబుల్ క్యాంపస్ ఇంపాక్ట్ సమ్మిట్ అండ్ అవార్డ్స్?2026లో కళాశాల ప్రతిష్టాత్మక గోల్డ్ సస్టైనబుల్ క్యాంపస్ అవార్డును దక్కించు కుంది. కళాశాల తరఫున వృక్షశాస్త్ర విభాగాధిపతి, పరీక్షల నియంత్రణ అధికారి (సీఓఈ) ప్రొఫెసర్ తిరుకోవెల శ్రీనివాస్ ఈ అవార్డును స్వీకరించారు. కళాశాలలో పర్యావరణ పరిరక్షణ, హరితహారం, సీడ్ బాల్ ఉద్యమం, జీవవైవిధ్య సంరక్షణ, వ్యర్థాల నిర్వహణ, నీటి సంరక్షణ, పచ్చదనం అభివృద్ధి వంటి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడం వల్ల ఈ జాతీయ స్థాయి గుర్తింపు లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫ్రూట్ గార్డెన్, రోజ్ గార్డెన్, వెజిటేబుల్ గార్డెన్, మెడిసినల్ ప్లాంట్ గార్డెన్‌లు కళాశాలకు ప్రత్యేక గుర్తింపును తీసుకు వచ్చాయి. ఈ తోటలు విద్యార్థులకు ప్రాయోగిక విజ్ఞానాన్ని అందించడంతో పాటు జీవవైవిధ్య పరిరక్షణ, పర్యావరణ చైతన్యం, ఔషధ మొక్కల ప్రాముఖ్యతపై అవగాహన పెంపొందించడం లో కీలక పాత్ర పోషిస్తున్నాయి. కళాశాల ప్రాంగణం లో చేపట్టిన పర్యావరణ హిత కార్యక్రమాలు సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు దోహదపడుతున్నా యని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. రామకృష్ణ మాట్లాడుతూ, జాతీయ స్థాయిలో లభించిన ఈ గోల్డ్ అవార్డు కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది సమిష్టి కృషికి నిదర్శనమని అన్నారు. వృక్షశాస్త్ర విభాగం నిర్వహిస్తున్న ఫ్రూట్ గార్డెన్, బటర్‌ఫ్లై గార్డెన్, మెడిసినల్ ప్లాంట్ గార్డెన్‌లతో పాటు పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు కళాశాలకు విశిష్ట గుర్తింపును తీసుకొచ్చాయని పేర్కొన్నారు. ఈ అవార్డు కళాశాల ప్రతిష్టను మరింత పెంచిందని, భవిష్యత్తులో దేశంలోనే ఆదర్శ సుస్థిర హరిత క్యాంపస్‌గా కళాశాలను తీర్చిదిద్దేందుకు మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. అవార్డు అందుకున్న ప్రొఫెసర్ తిరుకోవెల శ్రీనివాస్‌ను కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది ఘనంగా అభినందించారు. కార్యక్రమంలో సహాయాచార్యులు డాక్టర్ పడాల తిరుపతి, డాక్టర్ రౌతు రాధాకృష్ణ, డాక్టర్ తాహెర్ హుస్సేన్, డాక్టర్ బుంగ తిరుపతి, కళాజ్యోతి, తాజుద్దీన్, స్వరూప రాణి తదితరులు పాల్గొన్నారు. అలాగే పీజీ విద్యార్థులు మానస, గంగోత్రి, కావ్య, రుచిత కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపల్స్ నితిన్ పాఠక్, తాళ్లపల్లి రాజయ్య, హరిత యజ్ఞ సమన్వయకర్త డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు, అధ్యాపకులు ప్రొఫెసర్ తిరుకోవెల శ్రీనివాస్‌ను అభినందించి తమ హర్షాన్ని వ్యక్తం చేశారు.



## రుద్రంగి తూర్పు వాడ మున్నూరు కాపు సంఘం కార్యవర్గం ఎన్నిక

**రుద్రంగి జూన్ 1 (జనం సాక్షి)**
రుద్రంగి మండల కేంద్రంలో గల తూర్పు వాడ మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పిప్పరి మోహన్, ఉపాధ్యక్షుడిగా ఆకుల వెంకట్ రెడ్డి, కార్యదర్శిగా పుప్పాల భాస్కర్, కోశాధికారిగా లైసెట్టి గంగాధర్,కార్యవర్గ సభ్యులు జోగిని పెల్లి గంగాధర్, అలువాల నారాయణ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘ సభ్యులు తెలిపారు.

## ఎస్సై జ్యోతిని సన్మానించిన అన్నపూర్ణ అమ్మ ఫౌండేషన్



**ముస్తాబాద్ జూన్ 01 (జనంసాక్షి)**
ముస్తాబాద్ మండల కేంద్రంలోని ఎస్సై ,జి జ్యోతి పదవి బాధ్యతలు తీసుకున్న సందర్భంగా గూడెం గ్రామానికి చెందిన అన్నపూర్ణ అమ్మ ఫౌండేషన్ నిర్వాహకులు కూర సావిత్రి ,బోప్ప విజయలక్ష్మి మద్దివేని స్వరూప, బోప్ప పద్మలత, పిల్లమారి విజయ, శాలువాతో ఘనంగా సన్మానించి మెమొంటో అందించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వృద్ధులకు అనాధలకు రోజు అన్నం పెట్టడం పెద్ద పుణ్యం దొరుకుతుంది మీరు ఇలాంటి సేవ కార్యక్రమం చేయడం చాలా సంతోషిదాక విషయం నా వంతు కూడా మీకు సాయియ సహకారాలు అందిస్తానీ అన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన గన్నారం సర్పంచ్ సుజాత శ్రీనివాస్

**నిజామాబాద్ జిల్లా జూన్ 01 (జనంసాక్షి)**



ఇందల్వాయి మండలంలోని గన్నారం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవం చేసిన గన్నారం గ్రామ సర్పంచ్ సుజాత శ్రీనివాస్ సెక్రెటరీ శ్వేత వార్డ్ మెంబర్ ఎర్ర సాయిలు కారమార్ మోహన్ 1000240875. గ్రామ శాఖ అధ్యక్షులు బద్దం రెడ్డి తదితరు కాంగ్రెస్ కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు సిద్ధం లక్ష్మి అబ్బ గంగమని జాజుల గోపి తదితరులు కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభించిన సర్పంచ్ సుజాత శ్రవణ్ దేశాయ్

**పిట్లం జూన్ 01 (జనంసాక్షి):**



పిట్లం మండల పరిధిలోని కంబాపూర్ గ్రామంలో సోమవారం నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లును సర్పంచ్ సుజాత శ్రావణ్ దేశాయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇంటి యజమాని సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే తోట లక్ష్మికాంతారావు చిత్రపటాలకు పాలాభిషేకం చేసి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ శివకుమార్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు రమేష్ దేశాయ్, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## బీ.ఎస్సీ, నర్సింగ్ ప్రిన్సిపాల్ గా అనిత బాధ్యతలు స్వీకరణ



**సిరిసిల్ల టౌన్ జూన్ 1 (జనంసాక్షి):** రాజన్న సిరిసిల్ల జిల్లా లో కాళోజి నారాయణ బి,ఎస్సి నర్సింగ్ కాలేజీలో కట్టుకు అనిత అదిలాబాదు నుండి సిరిసిల్ల బిఎస్సి నర్సింగ్ కాలేజ్ కు బదిలీపై వచ్చారు. సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిఎస్సి నర్సింగ్ కాలేజీలో చదువుతున్న వారు నిరుపేద విద్యార్థులేని, వారిపై ప్రత్యేక దృష్టి సారించి ప్రయోజకులు అయ్యేవిధంగా కృషి చేస్తానని అన్నారు.

## కలెక్టర్ ను కలిసిన మత్స్య శాఖ అధికారి

**కామారెడ్డి ప్రతినిధి, జూన్ 01 (జనంసాక్షి)**



మత్స్య శాఖ అధికారిగా లయబ్ మొయినుద్దీన్ గా సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు.

## ఆయిల్ పామ్ నర్సరీలో నాణ్యమైన మొక్కలు సిద్ధం చేయాలి

- ప్రభుత్వ భూముల వివరాలను సమగ్రంగా సిద్ధం చేయాలి
- యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులు గడువులోగా పూర్తి చేయాలి
- సుల్తానాబాద్, ఎలిగేడు మండలాల్లో పర్యటించిన్ల కలెక్టర్ కోయ శ్రీహర్ష



**సుల్తానాబాద్,జూన్ 01(జనంసాక్షి) :**



ఆయిల్ పామ్ సాగు విస్తరణకు అవసరమైన నాణ్యమైన మొక్కలను సిద్ధం చేసి రైతులకు అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్ లికోయ శ్రీహర్షలి సోమవారం సుల్తానాబాద్ మండలంలోని రెబ్బల్ దేవ్‌పల్లి ఆయిల్ పామ్ ప్రైమరీ, సెకండరీ నర్సరీలను, ఎలిగేడు మండలంలోని ర్యాకల్ దేవ్‌పల్లి ప్రభుత్వ భూములను, నిర్మాణానికి సిద్ధంగా ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా రెబ్బల్ దేవ్‌పల్లి గ్రామంలో 48 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఆయిల్ పామ్ నర్సరీని పరిశీలించిన కలెక్టర్, రాబోయే ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన మేర రైతులకు నాణ్యమైన మొక్కలను సరఫరా చేయాలని సూచించారు. గత సంవత్సరం 40 వేల మొక్కలను ఇతర జిల్లాలకు సరఫరా చేసినట్లు, వాటిని తిరిగి తీసుకువస్తున్నట్లు అధికారులు వివరించారు. ప్రస్తుతం 20 వేల మొక్కలు అందుబాటులో ఉన్నాయని తెలపగా, 1,000 ఎకరాలకు అవసరమైన మొక్కలను సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.అనంతరం ర్యాకల్ దేవ్‌పల్లి పరిధిలోని ప్రభుత్వ భూములను పరిశీలించిన కలెక్టర్, మండలంలోని ప్రభుత్వ భూములకు సంబంధించిన సంపూర్ణ వివరాలను సిద్ధం చేసి సమర్పించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు.యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్, ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా నాణ్యతతో పనులు చేపట్టాలని, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ పర్యటనలో హార్టికల్చర్ అధికారులు ఎస్. మహేష్, జ్యోతి, తిరుమల ఆయిల్ పామ్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ కేశ్ కళ్యాణ్‌కర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ముస్తాబాద్ మండల నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన జ్యోతి

**ముస్తాబాద్ జూన్ 1 (జనంసాక్షి)**



ముస్తాబాద్ మండల నూతన ఎస్సైగా జి.జ్యోతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్సై గణేష్ సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్‌కు బదిలీ కావడంతో, ఆయన స్థానంలో జ్యోతి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆమెకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఆమె మాట్లాడుతూ. మండలంలో శాంతి భద్రతలను కాపాడటంతో పాటు, ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

## మేట్మె పల్లి కోర్టు ఆవరణలో ఉన్న ఎస్సారెస్పీ భూమిని కోర్టుకి అప్పగించాలి

### బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలేటి రాంరెడ్డి



**మేట్‌పల్లి జగిత్యాల జిల్లా జూన్ట్ 01(జనంసాక్షి):**
మేట్‌పల్లి కోర్టు ఆవరణలో ఉన్న ఎస్సారెస్పి భూమిని, కోర్టుకి అప్పగించాలని కోరుతూ బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలేటి రామ్ రెడ్డి సోమవారం ప్రజావాణిలో దరఖాస్తు చేసారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కోర్టులో అదనపు భవనాల నిర్మాణం కోసం అందుబాటు లో ఉన్న 38 గుంటల ఎస్సైరెస్పి భూమిని కోర్టు కి అప్పగించాలని కోరుతూ, ఆర్డివో కి విన్నవించినట్టు తెలిపారు. ఆయన వెంట ప్రధాన కార్యదర్శి నల్ల రాజేందర్, కోశాధికారి బిగుల్లా శంకర్, సాంస్కృతిక కార్యదర్శి కాజీపేట స్రవంతి, ఈసి మెంబర్ మాలేపు సంధ్యారాణి ఉన్నారు.

## ప్రజావాణిలో కలెక్టర్ కు వినతి పత్రం

### బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం ఏర్పాటుకు భూమి కేటాయించాలని కలెక్టర్‌కు వినతి

**జగిత్యాల జగిత్యాల జిల్లా జూన్ 01(జనంసాక్షి):**
జగిత్యాల జిల్లా కేంద్రంలో భారత మాజీ ఉప ప్రధానమంత్రి, దళిత మహానేత బాబు జగ్జీవన్ రామ్ గారి విగ్రహాన్ని ఏర్పాటు చేయుటకు తగిన స్థలాన్ని కేటాయించాలని కోరుతూ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం జిల్లా కన్వీనర్ బంగారు దీపక్ ఉత్సవ కమిటీ కన్వీనర్ దాసరి సతీష్ కుమార్ అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ వినతి పత్రంపై సానుకూలంగా స్పందించి, సంబంధిత మున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్ గారికి పరిశీలించి తగిన స్థలాన్ని కేటాయించే అంశంపై చర్యలు తీసుకోవాలని సూచించడం జరిగింది. బాబు జగ్జీవన్ రామ్ దేశ నిర్మాణంలో, సామాజిక న్యాయం కోసం చేసిన సేవలను గుర్తిస్తూ ఆయన విగ్రహాన్ని జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాలని పలువురు సామాజిక కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.



# పర్యావరణ పరిరక్షణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలి

## వనమహోత్సవ కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున పాల్గొనాలి:ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్



**కామారెడ్డి ప్రతినిధి, జూన్ 01 (జనంసాక్షి)** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఈ దిశగా ప్రజలందరూ చురుకుగా భాగస్వాములు కావాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ పిలుపునిచ్చారు.సోమవారం రామారెడ్డి మండలంలోని రామారెడ్డి, గిద్ద గ్రామాల్లో నిర్వహించిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జూన్ 1 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించే పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు, వనమహోత్సవ మొక్కల నాటే కార్యక్రమాల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.ఈ సందర్భంగా కామారెడ్డి డివిజన్ అటవీ అధికారి రామకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో సుమారు రెండు లక్షల ఎకరాల అటవీ ప్రాంతం ఉందని, అందులో అనేక రకాల వృక్షజాలం, వన్యప్రాణులు ఉన్నాయని తెలిపారు. ఇటీవల పెద్దపులి కూడా ఈ ప్రాంతాన్ని సందర్శించినట్లు పేర్కొన్నారు. అడవులు, వన్యప్రాణుల సంరక్షణ మనందరి బాధ్యత అని, వనమహోత్సవ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని ఇంటింటా మొక్కలు నాటాలని సూచించారు.అనంతరం లెమన్ గ్రాస్, కలబంద, ఇన్సులిన్ మొక్కలు తదితర ఔషధ మొక్కలను ప్రదర్శిస్తూ వాటి ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. అలాగే మోదుగ విస్తరాకులు, ఇప్ప పూల సేకరణ ద్వారా టీ, ఇప్ప లడ్డూలు వంటి విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేసి గ్రామీణ మహిళా సంఘాలకు ఉపాధి, ఆదాయ వనరులు కల్పించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు బండి ప్రవీణ్, మొగుళ్ల సరిత, మండల అభివృద్ధి అధికారి నాగేశ్వర్, ఎస్సై రాజశేఖర్, మండల పంచాయతీ అధికారి తిరుపతి రెడ్డి, ఏపీవో ధర్మారెడ్డి, అటవీ శాఖ అధికారులు ముబాషిర్, మమత, ఫరూక్, వేదాంతాచారి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# ఆంగ్లంతోనే భవిష్యత్

## లెట్స్‌టాక్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ బి జ్యోతి వెల్లడి

## నగరంలో ఔట్‌డోర్ సెమినార్ విజయవంతం

**నిజామాబాద్ ప్రతినిధి, 01 జూన్(జనంసాక్షి)** విద్యార్థులు, ఉద్యోగస్తులు ఆంగ్లంలో ప్రావీణ్యం ఉంటేనే భవిష్యత్తులో రాణిస్తారని లెట్స్‌టాక్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ బి జ్యోతిభాస్కర్ వెల్లడించారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని శివాజీనగర్‌లో గల మున్నురుకాపు కళ్యాణమండపంలో ఔట్‌డోర్ సెమినార్ నిర్వహించారు. విద్యార్థులు నాలుగు గోడల మధ్య కాకుండా వంద మందిలో కాకుండా విశ్వాసంగా మాట్లాడాలని, అప్పుడే అన్ని రంగాల్లో అన్ని చోట్ల రాణిస్తారని తెలిపారు. నగరంలోని ఆ సంస్థకు ఉన్న మూడు బ్రాంచ్‌లలో వేసవి సెలవుల్లో స్పొకేన్ ఇంగ్లీష్, ఫోనిక్స్ తరగతులు నిర్వహించారు. వేసవి క్యాంపు ముగిసిన సందర్భంగా విద్యార్థుల నైపుణ్యాన్ని పరీక్షించేందుకు మూడు బ్రాంచ్‌లలోని విద్యార్థులను ఒకే వేదికపైకి తీసుకొచ్చి ఈ సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌లో ఒక్కో విద్యార్థి ఒక్కో అంశంపై కనీసం మూడు నిమిషాల పాటు మాట్లాడాల్సి ఉంటుంది. ఏ విద్యార్థి గ్రామర్ తప్పులు లేకుండా విశ్వాసంగా మాట్లాడతారో ఆ విద్యార్థులను విజేతలుగా ప్రకటించి మెమెంటో ప్రధానం చేశామని తెలిపారు. ఈ సెమినార్‌కు విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు కూడా హాజరయ్యారని వివరించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంతో పాటు ఇంగ్లీష్ చదవడం, రాయడం రాని విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధతో తరగతులు బోధిస్తున్నామని ఆమె తెలిపారు. గడిచిన ఎనిమిది సంవత్సరాల్లో లెట్స్ టాక్ ఇనిస్టిట్యూట్ నిజామాబాద్ పట్టణంలోనే మూడు బ్రాంచులతో ముందుకు సాగుతుందని వివరించారు. ఈ సంవత్సరం మంచి నాణ్యమైన విద్య అందించేందుకు ది విద్యార్థి స్కూల్‌తో ముందుకు వస్తున్నామని, తల్లిదండ్రులు ఆదరించాలని ఆమె కోరారు.

# అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇండ్లు

**○ మాట ఇచ్చి చేతల్లో చూపుతున్నాం ○ బిఆర్ఎస్ పదేళ్ల హయాంలో పేదలకు అన్యాయం ○ త్వరలోనే రెండో దశ ఇండ్ల మంజూరు ○ ఇండ్లకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం దేశంలో తెలంగాణ లోనే అమలు ○ తెలంగాణ ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణరావు**

**సుల్తానాబాద్,జూన్ 01(జనంసాక్షి) :** మండలం లోని, భూపతిపూర్ గ్రామంలో నిర్మాణాలు పూర్తి చేసుకున్న ఇందిరమ్మ ఇండ్లను సోమవారం అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి ఇందిరమ్మ నూతన ఇండ్లను ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ ఇండ్ల లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశాలలో పాల్గొనడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. గత పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో ఇండ్లు మంజూరి చేయకుండా పేదలు అన్యాయానికి గురయ్యారని అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన అందరికీ ఇండ్లు ఇస్తున్నామని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం చేతల్లో చూపే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని స్పష్టం చేశారు. ఈ జూన్ మాసంలో రెండవ దశ ఇండ్ల మంజూరు జరుగుతుందని తెలిపారు. ప్రతినియోగ వర్గానికి 1500 నుండి 2000 లోపు వచ్చే ఇండ్లను అర్హులైన అందరికీ మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. ఇంటి నిర్మాణాలకు లబ్ధిదారులకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించిన ఘనత దేశంలో ఒక్క రేవంత రెడ్డి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పూర్తిగా పేదలు, రైతుల పక్షపాతి అని చెప్పారు.గతంలో ఇందిరమ్మ ఇండ్లు అసంపూర్తిగా నిర్మించుకున్న వారికి, స్లాబ్ వేసుకొని వారికి కొత్తగా అవకాశం కల్పిస్తున్నట్టు చెప్పారు. పేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ఒకవైపు ప్రజలకు సంక్షేమ పథకాలు, మరోవైపు గ్రామ గ్రామాన అభివృద్ధి పనులతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలనలో దూసుకు వెళ్తోందని విజయ రమణారావు అన్నారు.సుల్తానాబాద్ మండలం రూరల్ గ్రామాల్లో 770 ఇండ్లు మంజూరు కాగా 200 ఇండ్లు నిర్మాణాలు ప్రారంభించకపోవడంతో అధికారులు రద్దు చేశారని చెప్పారు. ఇందులో 140 నిర్మాణాలు పూర్తి అయ్యాయని, మిగిలిన వాటిలో 90 శాతం పూర్తికా వస్తున్నాయని చెప్పారు.నెలన్నర రోజుల్లోగా అన్ని ఇండ్లకు ప్రారంభోత్సవాలు జరుగుతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రకాష్ రావు ,సర్పంచ్ చిన్నయ్య,పలు గ్రామాల సర్పంచ్ లు,వార్డు సభ్యులు స్థానిక ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,హౌసింగ్ డీఈఈ,ఏఈ తదితరులు పాల్గొన్నారు.



# కరీంనగర్ నియోజకవర్గంలో సొంతింటి కల నిజమవుతున్న వేళ

## కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్

**కొత్తపల్లి, జూన్ 01 (జనంసాక్షి) :** సోమవారం రోజు కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 16వ డివిజన్ మల్కాపూర్‌లో ఇందిరమ్మ గృహప్రవేశాల కార్యక్రమాన్ని కార్పొరేటర్, కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ, "పేదల సొంతింటి కలలను నెరవేరుస్తున్నది రేవంత్ అన్న ప్రభుత్వం అని 'ఇందిరమ్మ రాజ్యం – ఇంటింటా సౌభాగ్యం' అనే నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం పేద కుటుంబాల్లో సంతోషాన్ని నింపుతోందని, ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్ సర్వీస్, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే కార్యక్రమాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలు నిండు మనసుతో ఆశీర్వదించి, మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దీవించాలిని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కాంతాల జగన్ రెడ్డి, బొమ్మ గౌడ్, కాశీపాక శంకర్, గొర్రె పోచమల్లు, తోర్తి మహేష్, కాసరపు ఎల్లగౌడ్, బొమ్మ సత్యం, దేవునూరి శంకర్, కొక్కు సందీప్, గోనే హరీష్, జక్కు సత్తవ్వ, గంట రామ, అనుమల్ల నర్సయ్య, నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంబరాలు జరుపుకున్నారు.

# ప్రజావాణి దరఖాస్తులు సత్వరం పరిష్కరించాలి

## కలెక్టర్ చిత్ర మిశ్రా



**కరీంనగర్ బ్యూరో, జూన్ 01 (జనంసాక్షి) :** ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యతనిచ్చి క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ చిత్రా మిశ్రా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డితో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కొన్ని దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించారు. మొత్తం ప్రజావాణికి 188 దరఖాస్తులు వచ్చాయి. ప్రజావాణి కార్యక్రమాన్ని సీఎంఓ అధికారులు పర్యవేక్షిస్తున్నారని, సిబ్బంది నిబంధనలు పాటిస్తూ క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్జీ పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. శాఖల వారీగా పెండింగ్ లో ఉన్నలోకాయుక్త, ఎన్ హెచ్ఆర్సీ తో పాటు కోర్టు కేసుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

**రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి..**

రెడ్ క్రాస్ సేవలను విస్తరించేందుకు, వరదలు, విపత్తులు, ఆపద వేళ బాధితులకు సహాయం అందించేందుకు ఉద్యోగులు రెడ్ క్రాస్ సొసైటీలో సభ్యత్వం పొందాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**కరీంనగర్ నగరపాలక సంస్థలో 'ప్రజావాణి..**

**అర్జీలను స్వీకరించిన కమిషనర్ ప్రఫుల్ దేశాయ్.**

కరీంనగర్ నగరపాలక సంస్థ ఆవరణలోని కళాభారతి లో సోమవారం రోజు ప్రజల సమస్యల పరిష్కార వేదిక 'ప్రజావాణి' కార్యక్రమం జరిగింది. నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ వివిధ డివిజన్ల నుండి వచ్చిన ప్రజల నుండి వినతి పత్రాలను, దరఖాస్తులను స్వీకరించారు. వివిధ విభాగాలకు సంబంధించి మొత్తం 16 ధరఖాస్తులలో ఇంజనీరింగ్ 2,టౌన్ ప్లానింగ్ 5, రెవెన్యూ 6, పెన్షన్ 1, పారిశుధ్యం 2 చొప్పున రావడం జరిగింది. ప్రధానంగా కొత్త డ్రైనేజీల నిర్మాణం, అనాథరైజ్డ్ కన్‌స్ట్రక్షన్, మ్యుటేషన్, హౌజ్ నెంబర్ ఆన్ లైన్, న్యూ పెన్షన్, కుక్కల బెడద లాంటి తదితర సమస్యల పై దరఖాస్తులు సమర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... ప్రజావాణికి వచ్చే ప్రతి అర్జీని త్వరితగతిన పరిశీలించి పెండింగ్ లేకుండ సమస్యను పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. ప్రజావాణిలో నమోదైన ప్రతి సమస్యను విభాగాల ప్రకారం అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ అయాజ్, డిప్యూటీ కమిషనర్ ఖాధర్ మోహియోద్దిన్, డీసిపి బషీర్, డీఈ దేవేందర, వెటర్నరీ ఆఫీసర్ దుర్గప్రసాద్ రెడ్డి, ఏసిపిలు వేణు, శ్రీధర్, సూపరింటెండెంట్ సునీల్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

# కామారెడ్డి జిల్లా ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం: ఘనంగా ముగిసిన వేడుక

**కామారెడ్డి ప్రతినిధి 01(జనంసాక్షి):**
కామారెడ్డి జిల్లా ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం జిల్లా కేంద్రంలో అత్యంత వైభవంగా, ఆహ్లాదకర వాతావరణంలో జరిగింది. జిల్లాలోని వివిధ మండలాల నుండి భారీ సంఖ్యలో తరలివచ్చిన ఫోటోగ్రాఫర్ల సందడితో కార్యక్రమ ప్రాంగణం కోలాహలంగా మారింది.
ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేశారు.
ఆకట్టుకున్న పోలీస్ కళాజాత.. సామాజిక అవగాహనకార్యక్రమంలో భాగంగా కామారెడ్డి జిల్లా పోలీస్ కళాజాత బృందం ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.
రోడ్డు భద్రత – హెల్మెట్ ప్రాధాన్యత: వృత్తిరీత్యా నిరంతరం ప్రయాణాలు చేసే ఫోటోగ్రాఫర్లు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని పోలీస్ సిబ్బంది పిలుపునిచ్చారు. "కుటుంబ పెద్దను కోల్పోతే ఆ కుటుంబం పడే బాధ వర్ణనాతీతం" అంటూ వారు పాడిన పాట అక్కడి వారిని ఎంతగానో కదిలించింది.
సైబర్ క్రైమ్ అవగాహన: ఈ సందర్భంగా సైబర్ క్రైమ్ ఎస్సై (రాఎ) గారు మాట్లాడుతూ, ప్రస్తుత డిజిటల్ యుగంలో ఫోటోగ్రాఫర్లు సైబర్ నేరాల పట్ల ఎలా అప్రమత్తంగా ఉండాలో, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో సమగ్రంగా అవగాహన కల్పించారు.



**నూతన కమిటీ ప్రమాణ స్వీకారం**
ఎన్నికల కమిటీ సభ్యులు నవీన్, సంగమేశ్వర్ ల ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన ఎన్నికలలో నూతన కార్యవర్గాన్ని పారదర్శకంగా ఎన్నుకున్నారు.
జిల్లా నూతన అధ్యక్షుడు: శమీర్,ప్రధాన కార్యదర్శి: నవీన్,కోశాధికారి: రాజు నూతనంగా ఎన్నికైన వీరికి రాష్ట్ర సంఘ ప్రముఖులు నియామక పత్రాలను అందజేశారు. అనంతరం రాష్ట్ర కమిటీ సభ్యుల సమక్షంలో నూతన కార్యవర్గ సభ్యులచే అధికారికంగా ప్రమాణ స్వీకారం చేయించారు.

**ముఖ్య అతిథులు - అభినందనలు**
ఈ వేడుకకు రాష్ట్ర సంఘం తరఫున వ్యవస్థాపక అధ్యక్షులు వెంకట్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిరి రవి, రాష్ట్ర కోశాధికారి భీమిడి మాధవరెడ్డి, రాష్ట్ర సభ్యులు జగదీష్, అలాగే సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ, తెలంగాణ వ్యాప్తంగా ఫోటోగ్రాఫర్ల సంక్షేమం కోసం ప్రభుత్వం మరియు సంఘం తరఫున జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలను, సంక్షేమ పథకాలను వివరించారు. ఎన్నికలను ఎంతో పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించిన ఎన్నికల కమిటీ సభ్యులను రాష్ట్ర కమిటీ ప్రత్యేకంగా అభినందించింది.

**ఘనంగా సన్మానాలు**
కార్యక్రమం ముగింపులో జిల్లా సంఘం పురోభివృద్ధికి తోడ్పడిన పలువురు ప్రముఖులను, సీనియర్ ఫోటోగ్రాఫర్లను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన ఫోటోగ్రాఫర్ల ఆత్మీయ కలయికతో ఈ ప్రమాణ స్వీకార మహోత్సవం కామారెడ్డిలో ఒక మైలురాయిగా నిలిచిందని సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.



# ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా పొట్టిగిని శంకర్ నియామకం

**భిక్కనూరు జూన్ 01 (జనంసాక్షి మండల ప్రతినిధి)**
భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన పొట్టిగిని శంకర్ ను రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శిగా సోమవారం గాంధీభవన్ లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, మానుకొండూరి శాసనసభ్యులు,రాష్ట్ర ఎస్టీసెల్ చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణ చేతుల మీదుగా కాంగ్రెస్ ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శిగా పొట్టిగిని శంకర్ నియామక పత్రం అందుకున్నారు,ఈసందర్భంగా శంకర్ మాట్లాడుతూ అధిష్టానం తనపై నమ్మకంతో పార్టీకి అందిస్తున్న సేవలను గుర్తించి తనకు అప్పగించిన పదవికి తగిన న్యాయం చేస్తానని తెలిపారు,అదే విధంగా ప్రతి గ్రామంలో ఎస్సీసెల్ విభాగం ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యం పరుస్తానని హామీ ఇచ్చారు,నాపై నమ్మకం ఉంచి రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించిన టిపిసిసి రాష్ట్ర అధ్యక్షుడుకు,ఎస్టీ సెల్ చైర్మన్ కు జిల్లా,మండల కాంగ్రెస్ పార్టీ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

# సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన సుడా చైర్మన్

**కొత్తపల్లి, జూన్ 01 (జనంసాక్షి) :**
కిసాన్ నగర్ 29వ డివిజన్ లో సిసి రోడ్డు పనులకు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. సుడా రెండేళ్ల ప్రగతి పక్షోత్సవాలలో భాగంగా స్థానిక ప్రజల కోరిక మేరకు 15 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణం చేపట్టామని నరేందర్ రెడ్డి తెలిపారు. అంతర్గత రోడ్లు గుంతలై ప్రజలు ఇబ్బందిపడుతున్న రోడ్లను మొదటి ప్రాధాన్యతగా తీసుకుని అభివృద్ధి చేస్తున్నామని ఈ రెండేళ్లలో అనేక రోడ్లను అభివృద్ధి చేశామని రాబోయే రోజుల్లో ఇంకా అవసరమైన చోట తప్పకుండా అభివృద్ధి పనులు చేపడుతామని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో స్థానిక కార్పొరేటర్ ఏఈ సతీష్, సోమిడి వేణు ప్రసాద్, కాంపెల్లి కీర్తి కుమార్, కుర్ర పోచయ్య, తోట అంజయ్య, మంద మహేష్, మేరాజ్, అశోక్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించిన ఎమ్మెల్యే

**ఆర్మూర్, జూన్ 1 (జనంసాక్షి):**
ఆర్మూర్ నియోజకవర్గంలోని డొంకేశ్వర్ మండలం అన్నారం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశానికి ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి,సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా కలిసి రిబ్బన్ కట్ చేసి సోమవారం ప్రారంభించారు.లబ్ధిదారు పద్మరెడ్డీ ప్రియాంక నూతన ఇంటి గృహప్రవేశంలో పాల్గొని నూతన వస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరి కుటుంబ ఆకాంక్ష సొంత ఇల్లు ఉండడమేన్నారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఒక్కరికి ఇల్లు ఉండాలని ఆశతో కార్యక్రమాలు చేపడుతుందన్నారు.ప్రభుత్వాలు ఏవైనా ప్రజల సంక్షేమం,అభివృద్ధి కోరుకోవడమే లక్ష్యమన్నారు.ఈ కార్యక్రమంలో అన్నారం గ్రామ సర్పంచ్ సంజీవ్,బిజెపి మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి,జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు సురేందర్, బిజెపి మండల ఉపాధ్యక్షుడు గంగసరా మురళి మరంపల్లి సర్పంచ్ గంగాధర్,కల్లెం సంతోష్ రెడ్డి, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## పెగడాపల్లిలో ఇందిరమ్మ గృహ ప్రవేశాలను ప్రారంభించిన జిల్లా పంచాయతీ అధికారి

**బోధన్, జూన్ 1 ( జనంసాక్షి ) :**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు బోధన్ మండలం పేకాటపల్లి గ్రామంలో సోమవారం ఇందిరమ్మ పథకం ద్వారా నిర్మించిన ఇండ్ల గృహప్రవేశాలను జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేద కుటుంబాలకు ఆసరాగా నిలవడంతో పాటు వారికి శాశ్వత నివాసంను ఏర్పాటు చేసేందుకు ఇందిరమ్మ పథకం ద్వారా ఐదు లక్షల రూపాయలతో గృహాన్ని నిర్మించడం అభినందనీయమని. పేద కుటుంబాలలో వెలుగును నింపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వంకు అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి నాగరాజు, సర్పంచ్ మద్ది రచన సుదర్శన్, ఉప సర్పంచ్ షబ్బీర్, టిపిసిసి డెలిగేట్ గంగాశంకర్, మండల పార్టీ అధ్యక్షులు నాగేశ్వర్ రావు, గ్రామ కార్యదర్శి రేష్మ బేగం, ఎంపీడీవో కిషోర్ నాయక్, మంద నాగరాజు, పోత రెడ్డి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# కామారెడ్డిలో 'ఇందిరమ్మ ఇండ్ల' పండుగ

- పేదల సొంతింటి కల సాకారం చేసిన ప్రజా ప్రభుత్వం!
- లబ్ధిదారులకు కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్

**కామారెడ్డి ప్రతినిధి, జూన్ 01 (జనంసాక్షి)**
కామారెడ్డి జిల్లా ప్రజలందరికీ, ముఖ్యంగా ఇండ్ల కల నిజం చేసుకోబోతున్న పేద కుటుంబాలందరికీ ఒక పండుగ రోజు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "ఇందిరమ్మ ఇండ్లు" పథకంలో భాగంగా.. మన కామారెడ్డి ప్రాంతంలో లబ్ధిదారుల గృహ ప్రవేశాల కార్యక్రమాన్ని ఎంతో ఘనంగా నిర్వహించుకుంటున్నాం. రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చేతుల మీదుగా లక్ష ఇండ్ల సామూహిక గృహ ప్రవేశాల మహత్తర కార్యక్రమం ప్రారంభమైంది. ఇందులో భాగంగానే మన జిల్లాలో కూడా పేదలకు పక్కా ఇండ్లను అందించి, వారి ముఖాల్లో ఆనందాన్ని చూడటం మాకెంతో సంతోషాన్ని ఇస్తోంది.ఈ సందర్భంగా మా ప్రజా ప్రభుత్వం తరఫున కొన్ని ముఖ్యమైన విషయాలను పత్రికా ముఖంగా మీ ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలనుకుంటున్నాను: సొంతింటి కల సాకారం: రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ పక్కా ఇండ్లలో ఆత్మగౌరవంతో నివసించాలనేదే మా ప్రభుత్వ ముఖ్య లక్ష్యం. మొదటి విడత ప్రగతి: రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతలో భాగంగా 4.50 లక్షల మందికి ఇండ్లను మంజూరు చేయడం జరిగింది. వేగంగా నిర్మాణ పనులు: వీటిలో ఇప్పటికే సుమారు 1.50 లక్షల ఇండ్ల నిర్మాణ పనులు అత్యంత వేగంగా పూర్తవుతున్నాయి. మిగిలిన ఇండ్లను కూడా త్వరలోనే పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తాం. రెండో విడత ప్రణాళిక: త్వరలోనే రెండో విడత కింద మరో 2.50 లక్షల ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టడానికి ప్రభుత్వం అన్ని రకాల ఏర్పాట్లను సిద్ధం చేసింది."ప్రగతి పథం.. సకల జనహితం.. మన ప్రజా ప్రభుత్వం" అనే నినాదంతో, అర్హులైన ప్రతి ఒక్క పేదవాడికి న్యాయం జరిగే వరకు మా ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తుంది.ఈ పథకానికి సంబంధించిన ఎలాంటి సందేహాలు ఉన్నా ప్రజలు టోల్ ఫ్రీ నెంబర్: 1800 599 5991 కి కాల్ చేసి వివరాలు తెలుసుకోవచ్చు. ఇందిరమ్మ ఇండ్ల లోకి అడుగుపెడుతున్న లబ్ధిదారులందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన మీడియా మిత్రులకు, ప్రజలకు అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఆశిష్ సంఘ్వాన్, అడిషనల్ కలెక్టర్ గిరి, కమిషన్ పర్వతాలు, ఎమ్మార్వో బిందు,కౌన్సిలర్స్ మోతిలాల్, మహేష్ ,వాజీద్, సుల్తానా సిద్దిక్,సుల్తానా బేగం యూనుస్,బబ్లు, ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులు,వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



